# సేవా మణి.. సృజన వాణి

• టీసీహెచ్‌వీ రమణ

సేవలోనూ ఒక క్రియేటివిటీ..అందుకే సృజన వాణి విభిన్న రకాల సర్వీసెస్ చేసి సేవలోనూ ఒక వినూత్నత సృష్టిస్తోంది. నగరంలోనే కాకుండా శివారు ప్రాంతాల సంగతి ఆలోచించేవారే తక్కువ. అలాంటిది వాళ్లు ఎంత దూరంలో ఉన్నా వెతుక్కుంటూ వెళ్లి సహాయం చేయాలనే ఆలోచన చాలా విలువైనది. ఇలాంటి పని ఒక్కరూ చేయడమే కష్టం. అలాంటిది మరికొంతమందిని కనీసం రోడ్లు కూడా సరిగ్గా లేని మారుమూల ప్రాంతాలకు బృందాలుగా వెళ్లి అక్కడ సహాయ కార్యక్రమాలు అందించడం హర్షణీయం. ఒక విద్యార్థి ఆలోచనకు కార్యరూపమే 'సృజనవాణి'. 1986లో డిప్లమా పూర్తి చేసిన ఒక విద్యార్థి రాళ్లపల్లి రవికుమార్ స్థాపించిన ఈ సంస్థ ఆవిర్భావం..నడుస్తున్న తీరు తెలుసుకుందామా..సృజన వాణి (వాయిస్ ఆఫ్ క్రియేటివిటీ) నేటి వరకూ నిర్విరామంగా కొనసాగుతోంది. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, అర్బన్ డెవలప్‌మెంట్, విపత్తు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం వీరు సెషన్స్ నిర్వహిస్తారు. వాటికి అటెండ్ అవ్వాలి. అక్కడి టీం మిమ్మల్ని గమనిస్తూ ఉంటుంది. వాళ్లకి మీరు నచ్చితే 'సృజనవాణిలో' సభ్యులు అయిపోయినట్టే.



రాళ్లపల్లి రవికుమార్



Voice of Creativity

### పల్లెల్లో విద్యావకాశాలు

వీళ్లు విద్యలో భాగంగా 'యువ కిరణ్' ప్రారంభించారు. ఇందులో మారుమూల గ్రామాలలో ఉండే చదువుకోవాలని ఆసక్తి ఉన్న బాలబాలికలను కనుగొని వారి ఆసక్తికి తగ్గట్టు ప్రోత్సాహాన్ని అందిస్తారు. ఆర్థికంగా కావలసిన వనరులను సమకూరుస్తారు. విశాఖలో ఉన్న 42 మండలాలో నుంచి 10వ తరగతిలో ప్రతిభ చూపిన వారిని సెలక్ట్ చేసి వారికి ప్రతిభా పురస్కారాలను అందిస్తారు. విద్యార్థులకు ట్యూషన్ చెప్పించేలా ఏర్పాట్లు చేస్తారు. విశాఖ జిల్లాలోని శంకరం పంచాయతీలో 'శ్రీకారం' పేరుతో ఒక స్కూల్‌ను నిర్మించారు.

### రూరల్ డెవలప్‌మెంట్

వృత్తి విద్యలను ప్రోత్సహించే విధంగా గ్రామాలలోని మహిళలతో సమావేశాలను నిర్వహించి ఆర్థికంగా చేయూతనిస్తారు. విలేజ్ డెవలెప్‌మెంట్ కమిటీలను నిర్వహించి ప్రభుత్వ పథకాలను అర్థమయ్యేలా వారికి వివరించి వాటిని ఎలా పొందాలో శిక్షణ ఇస్తారు. టైలరింగ్, డీటీపీ ఇలాంటి ఇంట్లో నేర్చుకునే వృత్తి విద్యలను నేర్పిస్తారు.

### మెడికల్ క్యాంపులు

వైద్యం అందుబాటులో లేని ప్రాంతాలలో సర్వే నిర్వహించి వారికి కావలసిన వైద్య సహాయాన్ని అందిస్తారు. ఇప్పటికే ఎన్నో వేల మంది అనేక రోగాల నుంచి కాపాడారు. చోడవరం,మాడుగుల ప్రాంతాలలో ఇప్పటికీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### అర్బన్ డెవలప్‌మెంట్

లయోలా స్వీట్ హోంతో కలిసి అక్కడి వృద్ధులకు వారికి కావలసిన ఆహారం,బట్టలు,నిత్యావసరాలు అందించి అన్ని విధాల వారికి సహాయపడుతున్నారు.దీనితో పాటు మురికిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయడం,బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలు నిర్వహించడం. మొక్కలు పెంచడం, వాటి పెంపకం గురించి అవగాహన పెంచడం.

**వసుధ** : వసుధ అనే చిల్డ్రన్ హోమ్‌లో ఇప్పటి వరకు ఐదుగుర్ని పెంచుతున్నారు. ఇందులో ఇద్దరు 4 వ తరగతి, ఒకరు డిప్లమా, మరొకరు ఇంజినీరింగ్ ఇలా చదువుతున్నారు.

### విపత్తులలో సహాయం

ఏదైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు అవసరమైన ఆహార పొట్లాలను, దుస్తులను, మారుమూల ప్రాంతాలలో ఉన్న వారికి సోలార్ లైట్లను పంపిణీ చేస్తున్నారు. వీటన్నింటికి ఆర్థికంగా సభ్యులే వారి జీతాలలో నుంచి నెలకు 10 శాతం చొప్పున సేవా కార్యక్రమాల కోసం కేటాయిస్తున్నారు. హుదూద్ తుఫాన్ బాధితులకు సైతం వీరు సేవలందించారు.

### ఉద్యోగాన్ని వదిలేశా..

నేను పీజీ చేసి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉన్న ఉద్యోగాన్ని వదిలి ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ముంబయ్‌లోని టాటా ఇనిస్టిట్యూట్‌లో 'మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్' కోర్స్ కంప్లీట్ చేసి సేవకు పూర్తిగా అంకితమయ్యాను.

– ఉమాశంకర్, సృజనవాణి





